క్లుప్తంగా

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి..


ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ హిమబిందు

పూసపాటిరేగ: ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ హిమబిందు అన్నారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రమంతప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు బంగారునాయుడు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అర్చకుడు మల్లికార్జునశర్మను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ వైకుంఠం, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలులో ఆంజనేయస్వామి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠ చేసిన రామతీర్థం శివాలయం అర్చకుడు మల్లికార్జునశర్మను వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు, గ్రామ పెద్దలు ఆల్తి ఆదినారాయణ, కురిమినేని దివాకర్, కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

'మేలుకొలుపు' పుస్తకావిష్కరణ


మేలుకొలుపు పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

విజయనగరం: తెలుగు భాష పరిరక్షణతోనే తెలుగుజాతి మనుగడ కొనసాగుతోందని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. తెలుగుభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ జక్కు రామకృష్ణ రచించిన 'మేలుకొలుపు ' అనే పద్యకావ్యాన్ని గణపతినీడి శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని కోట జంక్షన్ వద్ద గల జీయర్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మాతృభాష మాతృమూర్తి వంటిదని, తల్లిని గౌరవించినట్లే మాతృభాషను కూడా గౌరవించాలన్నారు. తెలుగులోనే సంభాషించాలని, మధురమైన మాతృభాష మనుగడకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, ప్రముఖ రచయిత కాగుపాటి నారాయణమూర్తి పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ


లింగంపేటలో విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

లక్కవరపుకోట: విత్తన శుద్ధి చేయడం వల్ల ఏ పంటలో అయినా కొన్ని రకాల తెగుళ్లను ముందుగానే నివారించవచ్చని సబల సంస్థ ప్రతినిధి కె.ఈశ్వరరావు అన్నారు.మండలంలోని లింగంపేట క్లస్టర్ పరిధిలో లింగంపేట, మార్లాపల్లి, చందులూరు, భూమిరెడ్డిపాలెం, లచ్చింపేట, కిత్తన్నపేట, రేగ, సంతపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులతో బుధవారం సామూహిక వరి విత్తన శుద్ధి చేయించారు. బీజామృతంతో వరి విత్తన శుద్ధి చేయడం వల్ల పొడతెగులు,అగ్గితెగులు, కాండం తొలుచు పురుగులను నివారించవచ్చన్నారు. సచివాలయాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గొడౌన్ నిర్మాణం పరిశీలన


గొడౌన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి వద్ద ఉద్యానవన పంటల నిల్వ కోసం ఉద్యానవన శాఖ నిధులు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న గొడౌన్‌ను ఆ శాఖ ఏడీ శైలజ, యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. నవంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని గుత్తేదారును వారు ఆదేశించారు.గొడౌన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని ఉద్యానవన రైతులు తాము సాగుచేసే పంటలను ఇక్కడ నిల్వచేసుకోవచ్చని అధికారులు చెప్పారు.

వేసవిలో వేళ తప్పకుండా..

- కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యకు చెక్
- ఫలించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ముందస్తు ప్రణాళికలు
- నాలుగేళ్లుగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు
- నేటికీ వర్షాకాలం తరహాలో 26 ఎంఎల్‌డీ నీటి సరఫరా


కుళాయిల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు


నెల్లిమర్ల వద్ద గల చంపావతి నదిలో వాటర్ పంప్‌హౌస్

విజయనగరం: ఎన్నో సంవత్సరాలుగా తాగునీటికి ఇబ్బంది పడ్డాం.. దాసన్నపేటలో తాగునీటి ట్యాంక్ నిర్మిస్తామని చెప్పి గతంలో పాలకులు హామీలు గుప్పించారు. కాని ఎవ్వరూ ఆ దిశగా ఆలోచించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా ప్రాంతంలో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేసి రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతోంది. కోలగట్ల వీరభద్ర స్వామి ఎమ్మెల్యేగా గెలిచాక జిల్లా కేంద్రం అభివృద్ధి చెందుతోంది.. ముఖ్యమంత్రి జగనన్నకు, ఎమ్మెల్యే కోలగట్లకు మా ప్రాంత ప్రజలందరూ రుణపడి ఉంటారని దాసన్నపేట నాగాశపు వీధికి చెంది జి.సత్యవతి చెబుతోంది. ఇది ఏ ఒక్క సత్యవతి చెబుతున్న మాటో కాదు... నగర శివారు ప్రాంతంలో నివసిస్తున్న వారు సైతం వేసవిలో తాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడలేదని చెబుతున్నారు. సుమారు నాలుగు నెలలు పాటు మిగిలిన నెలలతో సమానంగా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయడంలో కార్పొరేషన్ అధికారులు సఫలీకృతులయ్యారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముందస్తు ఆలోచనలతో అధికార యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టడంతో మండు వేసవిలో నిరంతరాయంగా నీటి సరఫరా చేశారు. వేసవి ప్రణాళికల్లో భాగంగా రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణకు రూ.65.87 లక్షలు ఖర్చు చేసి ద్వారా సుమారు 3 లక్షల జనాభా దాహార్తిని తీర్చారు.

గత పాలకుల వైఫల్యం..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగర ప్రజలు తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వేసవిలో ఐదు రోజులకోసారి నీటి సరఫరా చేయడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అప్పటి పాలకులకు ముందు చూపు లేకపోవడం వల్లే నీటి ఇబ్బందులేర్పడ్డాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో సాధారణ రోజుల్లోగానే వేసవిలో రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయగలిగారు.

26 ఎంఎల్‌డీ నీరు పంపింగ్

నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకాల నుంచి ప్రతిరోజూ 26 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేసినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆ మొత్తాన్ని నగరంలోని 34 రిజర్వాయర్లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ద్వారా ఒక రోజు 25 డివిజన్‌లకు, మరో రోజు 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు. ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తుండగా.... ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావులు నుంచి మరో 9 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ జరుగుతోంది. ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి వేసవి అంతా నీటిని పంపింగ్ చేశారు. నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాలు ఉండే చంపావతి నదిలో మార్చి నెలాఖరు నాటికి నీటి నిల్వలు అడుగంటిపోగా... ఎగువన ఉన్న ఆంధ్ర రిజర్వాయర్ నుంచి 43 కిలోమీటర్ల దూరంలో గల చంపావతి నదిలోకి నీటిని మళ్లించారు.

ముందస్తు చర్యలు...

వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా రూ.65.87 లక్షలతో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. చంపావతి నదిలో ఉన్న నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాల వద్ద రూ. రూ.9.25 లక్షలతో ఊటబావుల చుట్టూ ఇసుక బస్తాలు వేశారు. అదేవిధంగా ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం వద్ద రూ. 9.99 లక్షలతో ఊటబావుల చుట్టూ ఇస్తుక బస్తాలు వేయడం ద్వారా నీటిని నిల్వ ఉంచగలిగారు. నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాలలో పూడికలు తీసేందుకు రూ.15.80 లక్షలు ఖర్చు చేశారు. బోర్ల ఫ్లషింగ్‌కు రూ.10 లక్షలు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ. రూ.11.10 లక్షలు ఖర్చు పెట్టారు. ఆంధ్ర రిజర్వాయర్ నుంచి 43 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిమర్ల పంప్‌హౌస్ ఉన్న చంపావతి నదిలోకి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేందుకు రూ. 9.95 లక్షలు ఖర్చు చేశారు.

ప్రాంతం:	విజయనగరం కార్పొరేషన్
మొత్తం డివిజన్‌లు:	50
నివసిస్తున్న జనాభా :	3 లక్షలకు పైగా
నగరానికి నీటిని అందించే పంప్ హౌస్‌లు (నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి) :	3
ప్రతిరోజూ పంపింగ్ చేస్తున్న నీరు :	26 ఎంఎల్‌డీ
నగరంలోని మొత్తం రిజర్వాయర్ల సంఖ్య :	34
వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ఖర్చు చేసిన మొత్తం :	రూ.65.87 లక్షలు
నగరంలో పబ్లిక్ కుళాయిల సంఖ్య :	425
వ్యక్తిగత కుళాయిల సంఖ్య :	34,000

రోజు విడిచి రోజు సరఫరా..



మండు వేసవిలో నగర ప్రజలకు రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేశాం. చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోయే సమయానికి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టాం . మూడు రక్షిత మంచినీటి పథకాల వద్ద నిర్వహణ పనులు చేశాం. ఇప్పటికీ వర్షాలు కురవకున్నా తాగునీటికి సమస్య లేకుండా చూస్తున్నాం. వర్షాకాలం, శీతాకాలం తరహాలో వేసవిలో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేశాం.

– ఎస్.అప్పారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయనగరం కార్పొరేషన్.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోండి..


చింతలవలసలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

- కలెక్టర్ నాగలక్ష్మి

దెంకాడ: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలవలస–1,2 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. అలాగే ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని పరిశీలించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే మళ్లీ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ జీఎస్ నిర్మలాదేవి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్ము నాయుడు, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, జీసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరంలో మూతబడిన పాఠశాలలు

- ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్


పాఠశాల నుంచి బయటకు వచ్చేస్తున్న విద్యార్థులు

విజయనగరం: జిల్లా కేంద్రమైన విజయనగరంలో ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు బుధవారం మూతపడ్డాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల పేరిట చేస్తున్న దోపిడీ, పుస్తకాల విక్రయాల పేరుతో చేపడుతున్న అక్రమాలను నివారించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు ముందుస్తు సెలవు ప్రకటించేగా.. తరగతులు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ ప్రతినిధులు అడ్డుకున్నారు. పాఠశాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు రాజాన రమణ మాట్లాడుతూ, నారాయణ, చైతన్య లాంటి విద్యా సంస్థలతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చడం దురదృష్టకరమన్నారు. నిబంధనలు పాటించకుండా ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న పాఠశాలలు, హస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలను అరికట్టాలన్నారు. సీబీఎస్‌ఈ పేరుతో రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని కోరారు. ఫీజుల నియంత్రణకు జిల్లా స్థాయిలో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల భాగస్వామ్యంతో కమిటీలు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వంశీకుమార్, సాయి, గౌరీనాయుడు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్న డిమాండ్‌తో గురువారం చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు కోట సెంటర్ వద్ద కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు మాట్లాడుతూ, పశుసంవర్ధక శాఖలో యానిమల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు మెగా డీఎస్సీ, గ్రూప్ –2 నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణ్, సుమన్, శివరామారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు జంతువులకు టీకాలు

భోగాపురం: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా గురువార స్థానిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు (కుక్కలు) ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్యశాల సహాయ సంచాలకుడు ఉమాశంకర్ మహాపాత్రో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న పెంపుడు జంతువుల వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు.

బస్సు యాత్రకు స్పందన కరువు


జనం లేక వెల వెలబోతున్న బస్సు యాత్ర

నెల్లిమర్ల రూరల్: మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బస్సుయాత్రకు ప్రజల నుంచే కాకుండా, సొంత పార్టీ నేతల నుంచి కూడా స్పందన కరువైంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకే ప్రారంభం కావాల్సిన బస్సు యాత్ర..11 గంటలు దాటిన తర్వాత ప్రారంభమైంది. అనుకున్నంత మంది నాయకులు, కార్యకర్తలు రాకపోవడంతో నాయకులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. నియోజకవర్గ సీనియర్ నేత, మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు కార్యక్రమానికి హాజరు కాకపోవడం గమనార్హం. బస్సులో, బయట అంతా కలిపి సుమారు 300 మంది కూడా లేరు. ప్రజల నుంచి కూడా స్పందన లేకపోవడంతో టీడీపీ నేతలు విస్మయానికి గురయ్యారు. కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు స్థానిక రామతీర్థం జంక్షన్ వద్ద బస్సు యాత్రను ప్రారంభించి వెంటనే వెళ్లిపోయారు. మాజీ మంత్రి కోండ్రు మురళీ, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, నేతలు కిమిడి నాగార్జున, గుమ్మడి సంధ్యారాణి, కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్, తదితరులు బస్సు యాత్రలో పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు

- కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ శ్రీరాముల నాయుడు

విజయనగరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తిస్తున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు ఆదేశించారు. నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, సిబ్బందితో కమిషనర్ బుధవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీసర్వే, జగనన్న సురక్ష పథకం అమలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టర్ల వారీగా ఏఈలు బాధ్యత తీసుకొని పనులు త్వరితగతిన పూర్తయ్యేవిధంగా చూడాలన్నారు. పూర్తయిన పనులకు వెంటవెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

- ఎంఆర్‌పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ


ఐక్య నినాదం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

విజయనగరం ఫోర్ట్: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7న ఘనంగా నిర్వహించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్ కులాల రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం 59 కులాలకు సమానంగా పంపిణీ చేసినప్పుడే న్యాయం దక్కుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఈనెల చివరి వారంలో హలో మాదిగ – చలో హైదరాబాద్ పేరుతో మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సభకు మాదిగ సోదరులంతా తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ బోగి శ్రీనుమాదిగ, సాంబమూర్తి మాదిగ, శంకరరావు మాదిగ, దాస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో ఇంటింటా ఆనందం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కడుబండి, అప్పలనరసయ్య


గంట్యాడ: మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



లక్కవరపుకోట: మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటా ఆనందం నెలకొందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మార్లాపల్లి సచివాలయం పరిధి లింగంపేట గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించి, పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గండి పైడిరాజు, నందిపల్లి శ్రీరామ్మూర్తి, లెక్కల వీరబాబు, పినిశెట్టి కిష్టప్పదొర, యడ్ల కిశోర్,పెదిరెడ్ల వెంకటేష్, బోకం అప్పారావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలి

గంట్యాడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ను ఆశీర్వదించాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. మండలంలోని చినమధుపాడ గ్రామంలో బుధవారం 'గడపగడపకు మనప్రభు త్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యరంగానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎలాంటి వ్యాధికైనా ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందవచ్చని చెప్పారు. చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా కింద భృతిని అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు ,ఆ పార్టీ సానుభూతిపరులకు సైతం పథకాలు అందిస్తున్నామని చెప్పారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ గొర్లె చిన్నమ్మ, నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి, రామసూర్యం, కోడెల ముత్యాల నాయుడు, పలుశాఖల అధికారులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులతో యోగా చేయిస్తున్న ఆర్యసమాజం ప్రతినిధి

చీపురుపల్లి: నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, చిన్నతనం నుంచే యోగా సాధన చేయాలని ఆర్య సమాజం ప్రతినిధి కుమరపు అప్పలనాయుడు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యోగాపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతీ ఒక్కరి జీవితాల్లో నిత్యకృత్యంగా మారాలన్నారు. మారిన ఆహారపు అలవాట్లు, ఉద్యోగ, విధి నిర్వహణల్లో ఒత్తిడికి లోనవుతూ చాలా మంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారందరికీ యోగా దివ్య ఔషధం అన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.బలరాం, ఉపాధ్యాయులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ధనలక్ష్మి, జానకీరామయ్య పాల్గొన్నారు.